క్లుప్తంగా

వేసవి శిక్షణలో క్రాఫ్ట్స్ తయారీ



ద్రాక్షారామ శాఖా గ్రంథాలయంలో క్రాఫ్ట్స్ తయారీతో అలరించిన చిన్నారులు

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామ శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణలో భాగంగా వెల్ల మండల ప్రజాపరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బీవీవీఎల్ నారాయణ సహకారంతో విద్యార్థులు క్రాఫ్ట్స్ తయారీలో శిక్షణ పొంది రంగు, రంగుల పేపర్ అలంకరణలు తయారు చేశారు. అంతే కాకుండా వారికి నారాయణ మాస్టారు నైతిక ప్రవర్తన, తెలుగు భాష గొప్పతనం అంశాలపై అవగాహన కల్పించారు. గ్రంథాలయ అధికారి వి.అరుణ చిన్నారులకు స్నాక్స్ అందించి, క్రాఫ్ట్స్ తయారీతో అలరించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

బదిలీపై వెళ్తున్న కార్యదర్శికి సత్కారం



నేలటూరులో కార్యదర్శి సుధారాణి దంపతులను సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు

కపిలేశ్వరపురం: మండలంలోని నేలటూరు గ్రామ కార్యదర్శి ఎస్. సుధారాణి నల్లూరుకు బదిలీ అయ్యారు. నేలటూరులో శుక్రవారం గ్రామ ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలు కార్యదర్శి ఎస్.సుధారాణి, రామకృష్ణ దంపతులను ఘనంగా సత్కరించారు. సత్కరించిన వారిలో సర్పంచ్ కుక్కల వీరన్న, ఉప సర్పంచ్, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు శనక్కాయల దొరబాబు, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు సత్కరించారు.

31న మండపేట మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

మండపేట: మండపేట మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం ఈనెల 31వ తేదీ ఉదయం 11 గంటలకు జరుగుతుందని మున్సిపల్ చైర్పర్సన్ పతివాడ దుర్గారాణి తెలిపారు. పట్టణంలో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు సంబంధించి అజెండాలోని అంశాలను సభ్యుల ముందుంచుతామన్నారు. కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు హాజరు కావాలని చైర్పర్సన్ దుర్గారాణి శనివారం ఒక ప్రకటనలో కోరారు.

సీసీఆర్సీ కార్డులపై అవగాహన సదస్సు

కాజులూరు: సీసీఆర్సీ కార్డుల దరఖాస్తులు, వినియోగంపై సోమవారం గొల్లపాలెం సచివాలయం-2లో జరగనున్న అవగాహన సదస్సును రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వీఆర్వోల సంఘం అధ్యక్షుడు ఈశ్వరరావు కోరుతున్నారు. శనివారం గ్రామంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ పంటల సాగుదారుల చట్టం-2019 ద్వారా రాష్ట్ర ప్రభుత్వం పంటల సాగుదారుల హక్కుపత్రం (సీసీఆర్సీ కార్డు)లను అందజేస్తుందన్నారు. భూ యజమానులకు ఎటువంటి నష్టం కలుగకుండా కేవలం 11 నెలల కాలపరిమితికి మాత్రమే కౌలు రైతుకు సీసీఆర్సీ కార్డు ఇవ్వడం జరుగుతుందని దీనిపై భూ యజమానులకు, కౌలురైతుకు అవగాహన కల్పించేందుకు ఈ అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. మండల తహసీల్దార్ బి.సాయిసత్యనారాయణ ఆధ్వర్యంలో ఉదయం 10 గంటల నుంచి అవగాహన సదస్సు జరుగుతుందని రైతులందరూ హాజరు కావాలన్నారు.

సంక్షేమ వారధులుగా వలంటీర్లు

కాజులూరు: సీఎం జగన్మోహన్రెడ్డి పాలనలో ఆయన అమలు చేస్తున్న బృహత్తర పథకాలను ప్రజలకు చేరవేస్తూ సంక్షేమ వారధులుగా వలంటీర్లు పని చేస్తున్నారని ఎంపీపీ మాత భారతి అన్నారు. శనివారం ఎంపీపీ, పార్టీ నాయకుడు మాత మురళి తదితరులు మండల గ్రామాల్లో పర్యటించి వెంకటాయపాలెం పేపకాయల బాబ్జి కల్యాణ మండపంలో ఆదివారం జరగనున్న వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని జయప్రదం చేయవలసిందిగా కార్యకర్తలను, ప్రజలను ఆహ్వానించారు. గొల్లపాలెంలో వారు మాట్లాడుతూ జగనన్న ఆశయ సాధనలో సైనికులుగా పనిచేస్తూ వలంటీర్లు ప్రజల మన్ననలు పొందుతున్నారన్నారు. వారిని మరింత పోత్సహించేందుకే ఏటా ప్రభుత్వం వలంటీర్లకు వందనం కార్యక్రమం ద్వారా సేవామిత్ర, సేవారత్న, సేవావజ్ర పథకాలతో సత్కరిస్తుందన్నారు. వెంకటాయపాలెం పేపకాయల బాబ్జి కల్యాణ మండపంలో ఆదివారం ఉదయం తొమ్మిది గంటలకు కాజులూరు, కె.గంగవరం మండల గ్రామాల వలంటీర్లకు మధ్యాహ్నం 12 గంటలకు రామచంద్రపురం మండల, పట్టణానికి చెందిన వలంటీర్లకు రాష్ట్ర మంత్రి చెల్లుబోయిన శ్రీనివాసవేణుగోపాలకృష్ణ చేతుల మీదుగా సత్కారాలు జరుగుతాయన్నారు. మండల గ్రామాలకు చెందిన వలంటీర్లతో పాటు పార్టీ కార్యకర్తలు, నాయకులు, ప్రజలు తప్పక హాజరు కావాలన్నారు.

అప్రమత్తతే శ్రీరామరక్ష

- 43 డిగ్రీల ఎండ తీవ్రత
- వడదెబ్బపై నిర్లక్ష్యం వహిస్తే ప్రాణాలకు ముప్పు



ఎండ తీవ్రతకు నిర్మానుష్యంగా మారిన రామచంద్రపురం ప్రధాన రహదారి

రామచంద్రపురం: రోహిణీ కార్తె ప్రారంభంలోనే ఎండ తీవ్రత అధికంగా మారింది. గత వారం రోజుల క్రితం సాధారణ వర్షం వచ్చినా.. ఈనెల 25 నుంచి రోహిణీ కార్తె రావటంతో మరోసారి ఎండలు అధికమయ్యాయి. రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల పరిధిలో శనివారం 42 నుంచి 43 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉదయం 10 గంటల నుంచే ఎండ అధికంగా ఉండటంతో ప్రజలకు ఇళ్లకే పరిమితయ్యారు. సాయంత్రం 5.30 గంటల వరకు వేడిమి వాతావరణమే ఉంది. దీంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. ఎండలో ఎక్కువగా గడిపితే డీహైడ్రేషన్ (శరీరంలో నీటి శాతం తగ్గడం), డయేరియా(విరేచనాలు) తదితర సమస్యలతో ఇబ్బంది పడే అవకాశం ఉంది. మరో వారం రోజుల పాటు ఎండ తీవ్రత అధికంగా ఉంటుందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వడదెబ్బ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రామచంద్రపురం ఏరియా ఆసుపత్రి వైద్యులు డాక్టర్ ఎస్.ప్రవీణ్కుమార్ వివరిస్తున్నారు.

ఎండలో అధికంగా పనిచేయరాదు

ప్రజలు వేసవిలో వీలైనంతగా పనిచేయకుండా ఉండటం మంచిది. ఉదయం సాయంత్రం మాత్రమే పనులు చేసుకోవడం మేలు. ఎండలో ఎక్కువసేపు పనిచేస్తే చర్మం పొడి బారటం, కళ్లు ఎరుపెక్కడం, ఒళ్లు మంటలు, నొప్పులు వస్తాయి. ఒక్కోసారి అపస్మారక స్థితిలోకి వెళ్లే అవకాశం కూడా ఉంటుంది. ఇలాంటి తరుణంలో వడదెబ్బకు గురైన బాధితులను చల్లని ప్రాంతంలో ఉంచి చల్లని గాలి తగిలేలా చూడాలి. శరీరాన్ని తడిగుడ్డతో బాగా తుడవాలి. ఉష్ణోగ్రత ప్రభావం తగ్గని పక్షంలో దగ్గరలో ఉన్న ఆసుపత్రికి తరలించాలి.

వడదెబ్బకు ప్రథమ చికిత్స



డాక్టర్ ఎస్.ప్రవీణ్కుమార్, ఏరియా ఆసుపత్రి, రామచంద్రపురం

- వడదెబ్బ తగిలిన వ్యక్తిని త్వరగా నీడ ఉన్న ప్రదేశానికి చేర్చాలి.
- చల్లటి నీటిలో ముంచిన తడిగుడ్డతో శరీరం బాగా తుడవాలి.
- శరీరం సాధారణ ఉష్ణోగ్రతకు వచ్చే వరకూ ఇలానే చేస్తూ ఉండాలి.
- ఉప్పు కలిపిన మజ్జిగను తాగించాలి. లేని పక్షంలో గ్లూకోజ్ ద్రావణం తాగించాలి
- వడదెబ్బ తగిలి అపస్మారక స్థితిలో ఉన్న రోగికి నీరు తాగించరాదు.
- వడదెబ్బ తగిలితే వీలైంత త్వరగా ఆసుపత్రికి తరలించాలి.

వేసవిలో చేయకూడని పనులు

- ఎండ తీవ్రత అధికంగా ఉన్న సమయంలో ఎక్కువగా తిరగరాదు.
- మద్యం తాగరాదు.
- రోడ్ల మీద చల్లని రంగుపానీయాలు తాగరాదు
- రోడ్లపై అమ్మే కలుషిత ఆహారం తినరాదు
- వేసవిలో మాంసాహారం తగ్గించాలి
- నూనెలో వేయించిన ఆయిల్ ఫుడ్ ఎక్కువగా తినకూడదు.

వేసవిలో చేయాల్సిన పనులు

- నీరు, పళ్ల రసాలు, కొబ్బరి నీటితో పాటుగా ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి.
- రోజుకు కనీసం 15 గ్లాసుల నీటిని తాగాలి
- పరిశుభ్రతకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలి
- లేత వర్ణం, తేలికైన కాటన్ దుస్తులను ధరించాలి
- ఆరుబయట పడుకున్నప్పుడు దోమతెరలు వాడాలి
- బయటకు వెళ్లవలసి వస్తే గొడుగు, టోపీలను తీసుకెళ్లాలి.
- చల్లని ప్రదేశంలో ఉండేందుకు ప్రయత్నించాలి
- తాజా కాయగూరలు, ఎక్కువగా తీసుకోవాలి

వైఎస్సార్ సీపీ గెలుపునకు పాటుపడాలి



ఏడిదలో ఎమ్మెల్సీ తోట సమక్షంలో పార్టీలో చేరిన స్థానికులు

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- ఏడిదలో వంద మందికి పైగా పార్టీలో చేరిక

మండపేట: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మండపేట నియోజకవర్గం నుంచి వైఎస్సార్ సీపీ భారీ విజయం సాధించేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పని చేయాలని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు కోరారు. మండలంలోని ఏడిద గ్రామంలో ఆ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పలివెల సుధాకర్ ఆధ్వర్యంలో వంద మందికి పైగా గ్రామస్తులు శనివారం ఎమ్మెల్సీ తోట సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన వారందరికీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ పేదల అభ్యున్నతికి పెద్దపీట వేస్తూ సీఎం వైఎస్ జగన్మోహన్రెడ్డి చేస్తున్న పాలనకు అన్ని వర్గాల ప్రజల నుంచి సంపూర్ణ మద్దతు లభిస్తోందన్నారు. పార్టీలో చేరిన నామల శ్రీను, కొండపల్లి రామకృష్ణ, తాతపూడి వెంకట్రావు, గెద్దాడ ఏడుకొండలు, ఉందుర్తి గన్నయ్య, ఖండవిల్లి దైవ సహాయం తదితరులు మాట్లాడుతూ సీఎం జగన్ ప్రజారంజక పాలన, ఎమ్మెల్సీ తోట నాయకత్వానికి ఆకర్షితులమై తాము పార్టీలో చేరామన్నారు. వచ్చే ఎన్నికల్లో నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ విజయానికి శక్తి వంచన లేకుండా పనిచేస్తామన్నారు. ఏడిద పంచాయతీ సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం, వైస్ ఎంపీపీ పసుమర్తి నాగబాబు, సొసైటీ చైర్మన్ రామిశెట్టి శ్రీహరిబాబు, కుడిపూడి రాంబాబు, ఉంఢ్రాజవరపు సంసోను, పలివెల సుబ్బయ్య, కుడెల్లి సురేష్, ఉండ్రాజవరపు మాణిక్యం, పలివెల చిన్న, వీధి చంటి బాబు, పువ్వల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు తెలుసుకుంటూ.. పరిష్కరించుకుంటూ..

- ఏడిదలో గడప గడపకూ
- నారయ్య వారి వీధి, మధువనం, కొత్తూరుల్లో ఎమ్మెల్సీ తోట పర్యటన



మహిళకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

మండపేట: సమస్యల సత్వర పరిష్కారానికి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం దోహదం చేస్తుందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. శనివారం సాయంత్రం ఆయన మండలంలోని ఏడిద గ్రామంలోని నారయ్య వారి వీధి, మధువనం, ఏడిద కొత్తూరు ప్రాంతాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఏడిద పంచాయతీ సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంల ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కుడిపూడి భవాని తదితరులు కూడా పాల్గొన్నారు. ఎమ్మెల్సీ తోట ఇంటింటికీ వెళ్లి గత నాలుగేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో ప్రభుత్వం ద్వారా చేకూరిన లబ్ధిని ఆయా కుటుంబాల వారికి వివరించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకుని వాటిని తీర్చేందుకు అధికారులకు ఆదేశాలిస్తూ ముందుకు సాగారు. నారయ్య వారి వీధిలో రోడ్డు లేదని, వీధి కుళాయి లేక తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు తెలుపగా వాటి ఏర్పాటుకు సత్వర చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ ఐ. రాజు, పంచాయతీ కార్యదర్శి వుండమట్ల వీర్రాజులను ఎమ్మెల్సీ తోట ఆదేశించారు. రాత్రి సమయాల్లో మందుబాబుల ఆగడాలతో తీవ్ర భయాందోళనలకు గురికావాల్సి వస్తోందని మధువనం వాసులు ఎమ్మెల్సీ దృష్టికి తెచ్చారు.ఎప్పటికప్పుడు వీధిలైట్లను ధ్వంసం చేస్తున్నారని సర్పంచ్ ఆశీర్వాదం ఎమ్మెల్సీ తోట దృష్టికి తీసుకు వచ్చారు. నైట్ బీట్ ఏర్పాటు చేసి ఆకతాయిల ఆగడాలకు చెక్ పెట్టాలని ఎస్ఐ బి. శివకృష్ణను ఎమ్మెల్సీ ఆదేశించారు. గృహనిర్మాణ సాయం, పింఛన్లు తదితర వ్యక్తిగత అవసరాలతో పాటు మౌలిక సమస్యలపై స్థానికులు ఇచ్చిన వినతులపై అక్కడికక్కడే అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పసుమర్తి నాగబాబు, సొసైటీ చైర్మన్ రామిశెట్టి శ్రీహరిబాబు, గ్రామ కమిటీ అధ్యక్షుడు పలివెల సుధాకర్, పార్టీ మండల కన్వీనర్ పిల్లా వీరబాబు, ఉప సర్పంచులు వరదా చక్రవర్తి, చంద్ర శ్రీనివాస్, ఏఎంసీ డైరెక్టర్ ముగ్గుళ్ల పార్థకృష్ణ, పార్టీ నాయకులు కుడిపూడి రాంబాబు, బూరిగ జానీ, పమిడిపల్లి నానాజీ, రామిశెట్టి శ్రీనివాస్, కుడిపూడి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

హౌసింగ్ డే నిర్వహించిన అధికారులు



మాచవరంలో హౌసింగ్ లబ్ధిదారులతో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి శివశంకరప్రసాద్

రాయవరం: మండలంలోని మాచవరం గ్రామంలో శనివారం మండల ప్రత్యేకాధికారి వి.శివశంకరప్రసాద్, హౌసింగ్ అధికారులు హౌసింగ్ డే నిర్వహించారు. గ్రామంలోని జగనన్న లే అవుట్లో 215 గృహాలు మంజూరు కాగా, వాటిలో 98 ఇళ్లను పూర్తిగా నిర్మించారు. మిగిలిన ఇళ్లను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి శివశంకర ప్రసాద్, ఎంపీడీవో డి.శ్రీనివాసు, హౌసింగ్ ఏఈ కొవ్వూరి శ్రీనివాసరెడ్డి నిర్మాణదారులకు సూచించారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

పాలవెల్లువ విజయవంతం చేయాలి

జగనన్న పాలవెల్లువ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి శివశంకరప్రసాద్ సూచించారు. మండలంలోని మాచవరం, పసలపూడి, చెల్లూరు సచివాలయాల్లో సచివాలయ సిబ్బందితో జగనన్న పాలవెల్లువపై సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాడి రైతులను భాగస్వాములను చేయాలన్నారు. పాలవెల్లువ యాప్ను డౌన్లోడ్ చేసుకుని, యాప్లో పాడి రైతుల వివరాలను నమోదు చేయాలని వారు సూచించారు.

జగనన్న పాల వెల్లువ పథకంపై అవగాహన సదస్సు



ద్రాక్షారామ ఆర్బీకే వద్ద జగనన్న పాల వెల్లువ పథకంపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ కృష్ణార్జున

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామలో ప్రజాప్రతినిధులు, వలంటీర్లకు మండల పశు వైద్యాధికారి డాక్టర్ మేడిశెట్టి కృష్ణార్జున ఆధ్వర్యంలో శనివారం జగనన్న పాల వెల్లువ పథకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ద్రాక్షారామ సర్పంచ్ కొత్తపల్లి అరుణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డాక్టర్ కృష్ణార్జున మాట్లాడుతూ గ్రామాల్లో పశుపోషకులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచేందుకు జగనన్న పాల వెల్లువ పథకం అమలు చేస్తుందని తెలిపారు. పాలకు అధిక ధర కల్పించడం, ప్రతి 10 రోజులకు సొమ్ములు చెల్లించడం, పాడి పశువులకు ఉచిత బీమా సౌకర్యం కల్పించడం, పశువులకు నాణ్యమైన పశుదాణా అందించడం, ఉపాధి హామీ పథకం ద్వారా పశు గ్రాసం సాగు చేయించడం తదితర చర్యల ద్వారా పాడి రైతులు ఆర్థికంగా ఎదగడానికి దోహదం చేస్తుందన్నారు. ముఖ్యంగా మహిళా పాడి రైతులు మహిళా డెయిరీ సహకార సంఘాలుగా ఏర్పడి అభివృద్ధి చెందేలా ప్రణాళిక చేశామన్నారు. దీని కోసం ప్రజాప్రతినిధులు, ముఖ్యంగా వలంటీర్లు పాడి రైతులకు అవగాహన కల్పించి పథకం విజయవంతం అయ్యేలా ప్రభుత్వం నిర్దేశించిన విధంగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ పెన్నాడ బుచ్చిరాజు, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ అహ్మద్ అలీషా, వార్డు సభ్యులు డేగల వెంకటరమణ, సాక్షి పద్మనాభం, కొసనా భీమశంకరం, ఎంపీడీఓ ఎస్.షెలత్రాజు, పంచాయతీ కార్యదర్శి వలివేటి సూర్యసుబ్రహ్మణ్యం, వీఆర్ఓ సాయిబాబు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, పాడి రైతులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పాడి విప్లవం..

- విస్తారంగా జగనన్న పాలవెల్లువ పథకం కార్యాచరణ
- ప్రారంభం కానున్న మహిళా పాల సేకరణ కేంద్రాలు
- పాడి పరిశ్రమాభివృద్ధికి శ్రీకారం
- ప్రభుత్వ శాఖల అనుసంధానం



జగనన్న పాలవెల్లువ పథకంపై వడ్లమూరులో సచివాలయ ఉద్యోగులకు అవగాహన కల్పిస్తున్న ప్రతినిధి

కపిలేశ్వరపురం: ఏపీ పాడి పరిశ్రమాభివృద్ధి సహకార సమాఖ్య (ఏపీడీడీసీఎఫ్) పర్యవేక్షణలో గ్రామ గ్రామాన 'జగనన్న పాలవెల్లువ- మహిళా డెయిరీ సహకార సంఘాన్ని (ఎండీఎస్ఎస్) ఏర్పాటు చేసే ప్రక్రియ ఊపందుకుంది. పాడి విప్లవానికి ప్రభుత్వం నాంది పలికింది. పాడి పరిశ్రమకు పేరుగాంచిన మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల అభివృద్ధికి ఈ పథకం ఎంతగానో దోహదం చేస్తుంది.

జగనన్న పాలవెల్లువ పథకం ఇలా...

రెవెన్యూ, డీఆర్డీఏ, పంచాయతీరాజ్, కోపరేటివ్ శాఖల సమన్వయంతో ఏపీ పాడి పరిశ్రమాభివృద్ధి సహకార సమాఖ్య (ఏపీడీడీసీఎఫ్) పర్యవేక్షణలో జగనన్న పాలవెల్లువ పథకాన్ని నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో మహిళా పాడి రైతులను ఆర్థికంగానూ, సామాజికంగానూ మెరుగుపరచడమే ప్రధాన లక్ష్యం. మండపేట నియోజకవర్గంలోని మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం మండలాల్లో పాడి పశువుల పెంపకంగా విస్తారంగా ఉంది. పాల పోటీలను సైతం నిర్వహించుకుంటూ పాడి రైతులు తమను తాము ఉత్సాహపరుచుకునే వాతావరణం ఈ నియోజకవర్గంలో ఉంది. రామచంద్రపురం నియొజకవర్గంలోని కె.గంగవరం, కాజులూరు, రామచంద్రపురం రూరల్ గ్రామాల్లో పాడి పశువులు విస్తారంగా ఉన్నాయి.

గ్రామాల్లో కార్యాచరణ ఇలా...

జగనన్న పాలవెల్లువ పథకంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రభుత్వ యంత్రాంగం సన్నద్ధమైంది. తొలుత సంబంధిత శాఖల అధికారులకు అవగాహన కార్యక్రమం పూర్తవుతుంది. శుక్రవారం సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లకు అవగాహన కల్పించారు. శనివారం నుంచి గ్రామాల్లోని పాడి పశువులు, పాడి రైతుల స్థితిగతులపై సర్వే ప్రారంభించారు. జూన్ మొదటి వారంలో పథకం అమలుకు సిద్ధమయ్యేలా ప్రభుత్వం అడుగులు వేస్తుంది. సహకార రంగంలో డెయిరీలను బలోపేతం చేయడం ద్వారా పాడి పరిశ్రమాభివృద్ధికి కృషి చేస్తుంది. ప్రస్తుతం గ్రామాల్లో ప్రైవేటు డెయిరీల ప్రాధాన్యతే కొనసాగుతోంది. రైతులకు పాల డబ్బులను సకాలంలో చెల్లింపు చేయకపోవడం, ధర నిర్ణయంలోనూ, పాల నాణ్యతను నిర్ధారించ దంలోనూ పారదర్శకత లోపిస్తుందన్న వాదన ఉంది.

సహకార సంఘం ఏర్పాటు ఇలా...

రైతు భరోసా కేంద్రం ఉన్న గ్రామంలో జగనన్న పాల వెల్లువ- మహిళా డెయిరీ సహకార సంఘాన్ని (ఎండీఎస్ఎస్)ను ఏర్పాటు చేసి పాలను సేకరిస్తారు. పాల వ్యాపారాన్ని చేసుకోగల, వ్యాపారాన్ని సంరక్షించుకునే సామర్థ్యం గల 11 మంది ప్రమోటర్లను ఎన్నుకుంటారు. ఆర్బీకేలో కానీ, ఆర్బీకే లేని గ్రామంలో మహిళలకు సౌకర్యవంతమైన పబ్లిక్ బిల్డింగ్లో పాల సేకరణ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తారు. రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో పాలను సేకరించడానికి 11 మందిలో ఒకరిని కార్యదర్శిగా మేనేజింగ్ కమిటీ నియమిస్తుంది. వ్యాపారం పొందే లాభం నుంచి కార్యదర్శికి జీతం ఇస్తారు.

ఆసక్తిగల మహిళలు చేయాల్సిందిదే..

జేవీపీ పాల కేంద్రాల్లో పాలుపోయుటకు ఆసక్తి గల మహిళా పాడి రైతులందరూ విధిగా ఆయా పాల కేంద్రాల్లో తమ పేర్లను నమోదు చేసుకోవాలి. అందు కోసం ఆధార్ కార్డు, ఆధార్తో అనుసంధానమైన బ్యాంకు పాస్ పుస్తకం జెరాక్స్ కాపీలను అందజేస్తూ సచివాలయంలోని డిజిటల్ అసిస్టెంట్ సాయంతో ఏపీ పాడి పరిశ్రమాభివృద్ధి సహకార సమాఖ్య వెబ్సైట్లో వివరాలను నమోదు చేయించుకోవాలి. 8 అంకెలతో కూడిన గుర్తింపు సంఖ్యను ఖాతాదారుకు ఇస్తారు. ఆ సంఖ్య ఆధారంగానే పాలసేకరణ లావాదేవీలన్నీ కొనసాగుతాయి.

జగనన్న పాలవెల్లువ పథకంతో ప్రయోజనాలిలా...

జగనన్న పాలవెల్లువ పథకంలో మధ్యవర్తుల ప్రమేయం ఉండదు. దీంతో వారికి చెల్లించే కమీషన్లు రైతులకే చెందుతుండటంతో పాల ధర పెరిగే అవకాశం ఉంటుంది. లీటరు పాలకు వెన్న శాతాన్ని బట్టి, ఇతర డెయిరీల కన్నా రూ.5-10 వరకూ అదనంగా పాల ధర లభిస్తుంది. పాల సేకరణను కంప్యూటర్ (ఏఎంసీయూ)ఆధారంగా పరీక్షించడం వల్ల అవకతవకలకు ఆస్కారం లేదు. వెన్న శాతం పారదర్శకంగా కొలుస్తారు. క్రమం తప్పకుండా ఏడాదిలో 180 రోజులు పాలు పోస్తే ప్రతి లీటర్పై అదనంగా 0.50 పైసలు చెల్లిస్తారు. పాల బిల్లులను ప్రతి 10 రోజులకు ఒకసారి రైతుల బ్యాంక్ ఖాతాలకే నేరుగా జమ చేస్తారు. పశువుల బీమా సౌకర్యం, దాణా సరఫరా తదితర సౌకర్యాలు రైతులకు అందుతాయి.

ప్రభుత్వ శాఖల సమన్వయంతో కార్యాచరణ



జగనన్న పాలవెల్లువ పథకం గ్రామాల ఆర్థిక స్థితిగతులను ప్రభావితం చేస్తుంది. మహిళలు పథకాన్ని సద్వినియోగం చేసుకోవడం ద్వారా వారి కుటుంబాల ఆర్థిక, సామాజిక పరిస్థితులు మెరుగవుతాయి. ప్రభుత్వ శాఖల సమన్వయంతో పథకాన్ని ప్రజల ముందుకు తీసుకెళ్తున్నాం.

– డాక్టర్ అనిత, ఏడీఏ ఆలమూరు

గొప్పిరేవు వంతెనపై ట్రాఫిక్ అంతరాయం



ద్వారపూడి- యానం రహదారిపై గొప్పిరేవు వంతెనపై నిలిచిపోయిన వాహనాలు

కాజులూరు: ద్వారపూడి, యానం రహదారిలో ఉప్పుమిల్లి శివారు గొప్పిరేవు వంతెనపై శనివారం వాహనాలు నిలిచిపోవటంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. మండలంలోని ఉప్పుమిల్లి, దుగ్గుదుర్రు, పల్లిపాలెం, కాజులూరు తదితర గ్రామాల్లో అనధికార మట్టి తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. వ్యాపారులు పొలాల్లోని మట్టి దిమ్మలను ట్రాక్టర్లపై యానం తదితర ప్రాంతాల్లోని రియల్ఎస్టేట్ లే అవుట్లకు, ఇటుకల బట్టీలకు తరలిస్తున్నారు. ఈ క్రమంలో యానం వైపునకు బియ్యం లోడుతో వెళుతున్న లారీని యానం నుంచి ద్రాక్షారామ వైపునకు వస్తున్న మట్టి ట్రాక్టరు ఢీకొనటంతో రెండు వాహనాలు గొప్పిరేవు వంతెనపై నిలిచిపోయాయి. ఈ సంఘటనలో ఎవరికీ ఎటువంటి గాయాలు అవకపోయినప్పటికీ ఇద్దరు డ్రైవర్లు వాహనాలను మధ్యలో వదిలేసి తప్పునీదంటే, నీదంటూ ఘర్షణకు దిగటంతో రహదారిపై ఇరువైపులా కిలోమీటర్ మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. స్థానిక యువకులు కలుగజేసుకుని ఇరువురికీ సర్దిచెప్పి ట్రాఫిక్ను క్రమబద్ధీకరించటంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

నెక్కంటి శ్రీరాంజీకి ఎంపీ బోస్ పరామర్శ

కపిలేశ్వరపురం: పితృ వియోగంతో బాధపడుతున్న స్థానిక మాజీ వైస్ ఎంపీపీ నెక్కంటి శ్రీరాంజీని రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోసు శనివారం పరామర్శించారు. రాంజీ తండ్రి శ్రీహరి చిత్రపటానికి నివాళి అర్పించి ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు.

పలువురికి ఎమ్మెల్సీ తోట పరామర్శ...

మాజీ వైస్ ఎంపీపీ నెక్కంటి శ్రీరాంజీతో పాటు ఆప్తులను కోల్పోయి బాధల్లో ఉన్న కపిలేశ్వరపురం, అంగర, టేకి, శ్రీరాంపురం, కోరుమిల్లి, పడమర ఖండ్రిక గ్రామాల్లోని పలువురిని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పరామర్శించారు. ఆయన వెంట జెడ్పీటీసీ సభ్యుడు పుట్టపూడి అబ్బు, వైఎస్సార్ సీపీ నాయకులు మేడిశెట్టి దుర్గారావు, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు

మండపేట: మండపేటకు చెందిన ధాన్యం కమీషన్ వ్యాపారి అదృశ్యంపై పట్టణ పోలీస్ స్టేషన్లో కేసు నమోదైన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. స్థానిక బ్యాంకు కాలనీకి చెందిన గొలుగూరి వెంకట కోదండ రామారెడ్డి ఈ నెల 25వ తేదీ మధ్యాహ్నం సమయంలో రైతుకు సొమ్ములు ఇచ్చేందుకని ఇంటి నుంచి బయలుదేరి వెళ్లాడు. రాత్రి అయినా ఆయన ఇంటికి తిరిగి రాకపోవడంతో భార్య శ్వేత నాగదేవి ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు గురువారం అర్ధరాత్రి సమయంలో కేసు నమోదు చేశారు. కాగా వెంకట రామారెడ్డి మోటారు సైకిల్ను శనివారం మండపేట బైపాస్ రోడ్డులో పోలీసులు గుర్తించారు. రామారెడ్డి అదృశ్యమా? లేకా ఆర్థిక లావాదేవీలతో ఆయన్ను ఎవరైనా కిడ్నాప్ చేశారా అనే కోణాల్లో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సమాచారం.

కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

కె.గంగవరం: పేద ప్రజల కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను గ్రామ స్థాయిలోని ప్రజలకు వివరించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్రి చిట్టిబాబు అన్నారు. మండలంలో అముజూరులో శనివారం పార్టీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి పోలింగ్ బూత్కి 11 మందితో కూడిన సభ్యులను కమిటీగా నియమించాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వ అమలు చేస్తున్న పథకాలను ప్రతి బీసీ ఇంటికి కరపత్రాలు, స్టిక్కర్లు, గోడపత్రికల ద్వారా ప్రతి ఇంటికి చేరే విధంగా కార్యకర్తలు, ఓబీసీ మోర్చ పదవులు ఉన్న నాయకులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. నాయకులు వెంకటకృష్ణ, కోడూరి జయలక్ష్మి, చొల్లంగి బంగారం, వెంకటస్వామి, నున్న సత్యనారాయణ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

లొల్లలో బీజేపీ మండల సమావేశం

రాయవరం: భారతీయ జనతా పార్టీ మండల శాఖ సమావేశం శనివారం మండలంలోని లొల్ల గ్రామంలో నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న ఆ పార్టీ మండపేట నియోజకవర్గ కన్వీనర్ చాట్రాతి జానకిరాంబాబు, నేతలు ఇళ్ల వెంకటేశ్వరరావు, వల్లభనేని రవీంద్రబాబు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న పథకాలు, అభివృద్ధి పనులపై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. సమావేశంలో బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు శాఖా దుర్గా శ్రీనివాస్, రాష్ట్ర కన్వీనర్ నరాల రాంబాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు చిరట్ల సుబ్బారావు, పిల్లి సత్యనారాయణ, గునిపల్లి శ్రీనివాస్, కొవ్వూరి మణికంఠరెడ్డి పాల్గొన్నారు.

మండపేటలో..

మండపేట: బూత్ స్థాయి నుంచి బీజేపీని బలోపేతం చేసేందుకు నాయకులు కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇళ్ల వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక నాయుడు కల్యాణ మండపంలో పార్టీ పట్టణశాఖ అధ్యక్షుడు మద్దుల సుబ్బారావు అధ్యక్షతన శనివారం జరిగిన సమావేశంలో వెంకటేశ్వరరావు, అసెంబ్లీ నియోజక వర్గ కన్వీనర్ చాట్రాతి జానకి రాంబాబులు మాట్లాడుతూ ప్రధాని మోదీ పాలన తొమ్మిదేళ్లు పూర్తయిన సందర్భంగా ఈనెల 30 నుంచి జూన్ 30వ తేదీ వరకూ మోదీ సంక్షేమ కార్యక్రమాలపై ప్రతి ఇంటికి కరపత్రాలు పంపిణీని విజయవంతం చేయాలన్నారు. పార్టీ నాయకులు కేవీవీ సాయిరాం, నరాల రాంబాబు పాల్గొన్నారు.